**తన తండ్రిని వెళ్ళగొట్టేశాడు కొరగాని కొడుకు హరనాథరావు. భార్యతో తన కెవరూ లేరని చెప్పాడు.**

**ఇది పాత చెట్టు. మరి ఆ చెట్టుకు పూచిన కొత్త పువ్వు సుమతి! ఆమె వ్యక్తిత్వం అతడికి తగని బహుమతి!**

ఎలిమెంటరీ స్కూలు గంట మోగింది.

ఎప్పుడు గంట మోగుతుందా. ఎప్పుడు ఇంటికి వెళ్ళి పోదామా అని సిద్ధంగా ఉన్న పిల్లలు - తుపాకీ చప్పుడు విన్న పక్షుల్లా గోల చేసుకుంటూ పరుగులతో బయటపడ్డారు.

'రేపు పొద్దుటి వరకూ మళ్ళీ నాలుగు గోడల జైలుశిక్ష ఉండదు' అనే భావం అన్నీ పసి ముఖాల్లోనూ !

అయిదవ తరగతి విద్యార్థులు తమ తరగతి గది నుంచి అందరి కన్నా ఆఖరున బయటి కొచ్చారు.

స్కూలు గ్రౌండు నుంచి బయటికొచ్చి పక్కనే ఉన్న పార్కులోకి వెళ్ళారు రవి, చంటి. ఆ ఇద్దరూ అయిదవ తరగతి విద్యార్థులే.

జనంలేని చోటుని వెతికి రవిని పిలిచాడు చంటి.

అటూ ఇటూ చూసి, ఎవరూ లేరనే నిర్ధారణ కొచ్చి. సంచీ లోంచీ రెండు సిగరెట్లు తీశాడు చంటి. ఒకటి రవికి ఇచ్చాడు. "మా డాడీ జేబులోని పెట్టెలోంచి ఈ సిగరెట్లని తియ్యడం చాలా కష్టం అయిపోయిందిరా బాబూ !" అన్నాడు.

రవి అగ్గి పుల్ల గీశాడు. రెండు సిగరెట్లూ వెలిగించుకున్నారు.

మొదటిసారి పీల్చేసరికి ఇద్దరికీ దగ్గు వచ్చింది తెరలు తెరలుగా.

గోడ అవతల ఫుట్‌పాత్ నుంచి వీళ్ళని చూసిన ఓ కుష్ఠురోగి వాళ్ళ దగ్గరికి వచ్చేడు. వీళ్ళద్దరినీ అతడు వారం రోజుల నుంచి గమనిస్తున్నాడు.

చూడటానికి అతడు కురూపిలా ఉన్నాడు.

చేతివేళ్ళు, కాలి వేళ్ళు సగం సగం మాత్రమే ఉన్నాయి. చర్మం పెచ్చులు కట్టిందీ. దేహం మీద అక్కడక్కడ ఉన్న గాయాల లోంచి ఏదో బయటికి కారుతూ చూడడానికే వెగటు పుట్టుకొస్తోంది.

డెబ్బై సంవత్సరాల దరిదాపు వయసు కుష్ఠురోగిది.

ముఖం మీద వాలుతున్న ఈగల్ని సగం వేళ్ళులేని ఒక చేత్తో తోలుకుంటున్నాడు. రెండో చేతిలో బొచ్చె ఉంది.

"ఏరా వెధవన్నార వెధవా ! పోయి అడుక్కోక మమ్మల్ని ఇలా ఏడిపించుకు తింటావెందుకు?" దగ్గుని ఆపుకుని, అన్నాడు రవి.

"ఛీ కుష్ఠు వెధవా ! ఫో అవతలకి ! నిన్ను చూడ్డానికే నాకు అసహ్యం ! అవతలకి ! ఫో. నీ వ్యాధి మాకు అంటుకుంటుంది. వెళ్ళు ముసలినక్కా !" చంటి చీదరించుకున్నాడు.

ఇక ఓపిక లేక ఈగల్ని తోలుకోవడం మానేశాడు. కుష్ఠురోగి. అవి అలా వాలుతూనే ఉన్నాయి.

"వెళ్ళిపోత ను బాబూ. వెళ్ళిపోత ను. ఇక్కడుండను. కానీ ఒక మాట. మీ వయసెంతని బాబూ మీ కీ సిగరెట్ అలవాటు? ఈ అలవాటు మంచిది కాదు బాబూ. ఆరోగ్యం పాడైపోతుంది. మానెయ్యండి బాబూ. మీ భవిష్యత్తుని అంధకార బంధురం చేసుకోకండి. మీకు చేతులెత్తి దణ్ణం పెడత ను" దీనంగా అన్నాడు ఆ రోగి. అడుక్కునే బొచ్చెతో ఈగల్ని ఓసారి తోలుకున్నాడు - ఓపిక కూడగట్టుకుని.

"సగం సగం వేళ్ళతో నువ్ మాకు దణ్ణాలు పెట్టక్కర్లేదు గానీ వెళ్ళు వెళ్ళు" సిగరెట్ పెదాల మధ్య ఉంచాడు చంటి. అదేదో పెద్ద జోకైనట్టు నవ్వేడు రవి.

"తప్పు బాబూ. పెద్దవాళ్ళని అలా తిట్టకూడదు. నేను మీకు తాతయ్య లాంటివాణ్ణి." అన్నాడు అతడు.

"మా తాత ఎప్పుడో పోయాడు. మా నాన్న చెప్పాడు. నువ్వెళ్ళి నీ పని చూస్కో బే" అని, ఆఖరి దమ్ము పీల్చి దగ్గుతూ. సిగరెట్‌ని కొంచెం ఆవలగా పడేశాడు చంటి.

రవి కూడా సిగరెట్ ముగించాడు.

ఇద్దరూ లేచి, బయటికి నడిచారు.

రోగి గేటువైపు కదిలాడు - యథాస్థానానికి వెళ్లడానికి. ఫుట్‌పాత్ మీదికెళ్ళి కూర్చున్నాడు.

రవి ముందుగా రోడ్ క్రాస్ చేశాడు.

చంటి రోడ్ క్రాస్ చెయ్యడానికి ప్రయత్నిస్తూండడం - ఏదో ఒక వాహనం రావడం రెండు మూడుసార్లు జరిగింది. ఇక చంటిలో సహనం చచ్చిపోయింది. రోడ్ దాటడానికి ఆయత్త మయ్యాడు. పరుగు అందుకున్నాడు. ఇంతలో ఓ ఆటో చాలా వేగంగా వచ్చి, చంటిని గుద్దేసింది.

రోడ్ మీద పడి చంటి గిలగిలా కొట్టుకుంటున్నాడు. సంచీ దూరంగా పడింది. తలకి బలమైన గాయమయింది. రక్తం వస్తోంది. ఆ దృశ్యాన్ని చూసి, భయకంపితుడై, రవి ఇంటికి పారిపోయాడు.

ఎవరి పని వారు చూసుకుంటున్నారు. ఎవరూ చంటిని పట్టించుకోవడం లేదు. ఆఖరికి ఆటోవాడు కూడా ! వాడిదారి వాడు చూసుకున్నాడు.

ఫుట్‌పాత్ మీంచి చంటిని చూశాడు కుష్ఠురోగి. బొచ్చె అక్కడే వదిలేసి. కుంటుకుంటూ చంటి దగ్గరికి వచ్చేడు.

శరీరం మూలమూలల్లో ఉన్న ఓపిక నంతటినీ సమీకరించుకుని, చంటిని చేతుల మీదికి తీసుకున్నాడు. ఒంటినిండా నీరసం ఆవహించి ఉండడంతో అతడికి చంటి కూడా మోయలేని బరువు అయ్యాడు. నీరసాన్నీ నిస్సత్తువనీ లెక్క చెయ్యకుండా నడుచుకుంటూ వెళ్ళి, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లోకి తీసుకెళ్ళాడు.

నర్సింగ్ హోమ్‌లో అందరూ కుష్ఠురోగిని చూసి అసహ్యించుకున్నారు. చీదరించుకున్నారు. ఏవేవో అన్నారు.

"రక్తం చాలా పోయినట్టుంది బాబూ. కావాలంటే నా రక్తం తీస్కోండి. శరీరంలో ఎంత రక్తం ఉంటే అంత తీసేస్కోండి" అన్నాడు.

"సర్లే పోరా. పెద్ద చెప్పొచ్చావ్! అపర బలిచక్రవర్తివి వచ్చావ్. రక్తానికి ఏం గొడ్డుపోలేదులే. పో. బయటికి" అన్నా రెవరో.

చంటి ఎవరి బిడ్డో కుష్ఠురోగికి తెలుసు. అక్కడి డాక్టర్‌తో ఆ విషయం చెప్పి. బయటికి వచ్చేశాడు.

అడుగులు - జెండా కర్రలా ముందుకు

# పాతచెట్టు - కొత్తపూలు

గోపరాజు రాధాకృష్ణ

వెళుతున్నా... మనను మాత్రం జెండాలా వెనక్కే వెళుతోంది.

చంటి గురించి తెలిసిన మీదట ట్రీట్‌మెంట్ అరంభించారు అక్కడి డాక్టర్లు. కుష్ఠురోగి చెప్పిన నమాచారానికి తోడు, అక్కడి డాక్ట రొకడు చంటిని గుర్తించాడు.

చంటి తండ్రి హరనాథరావు. మెడికల్ ఆఫీసరు. కొత్తగా ట్రాన్స్‌ఫరై వచ్చాడు.

ఓ డాక్టరు హరనాథరావుకి ఫోన్ చేశాడు. వెళ్ళి డాక్టర్ని అడిగాడు.

ఎవరు తీసుకొచ్చారో చెప్పబుద్ధి కాలేదు డాక్టర్‌కి. "నర్లెండి. ఎవరు తీసుకొస్తే ఏమిటి? మొత్తంమీద తీసుకొచ్చారు. మానవత్వం ఈ జనారణ్యంలో ఇంకా బతికే ఉందని తెలియచెప్పే ఒక వ్యక్తి మీ చంటిని ఇక్కడికి తీసుకొచ్చాడు" అని మాత్రం చెప్పాడు.

అయిదు వంద నోట్లు పర్సులోంచి తీశాడు హరనాథరావు. అవి డాక్టర్‌కి ఇచ్చాడు. "చంటిని ఇక్కడికి చేర్పిన వాడికి ఇవ్వండి. మీ కాంపౌండర్ చేత పంపించండి" అన్నాడు.

కాంపౌండర్ అక్కడి కొచ్చాడు. డాక్టర్‌ని పక్కకి పిలిచాడు. "సార్! ఇందాక పేషెంట్‌ని ఇక్కడికి తీసుకొచ్చాడు చూడండి కుష్ఠురోగి, వాడు కుర్రాడికి ఎలా ఉందని అడుగుతున్నాడు. బాగానే ఉంది, పొమ్మంటే వెళ్ళడం లేదు. చూస్తాట్ట పేషెంట్‌ని" అని చెప్పాడు.

"ఎందుకు లెద్దూ? వాణ్ణి చూసి హరనాథరావుగారూ, మిస్సెన్నా ఫీలౌతారు. కుర్రాడు క్షేమంగా ఉన్నాడని చెప్పు. అయినా



హొటల్ కెళ్ళిన అనురూప్ అక్కడున్న ఓ వ్యక్తిని పిలిచి "కాఫీ తేవోయ్ నర్వరూ!" అన్నాడు.

వెంటనే ఆ వ్యక్తి అనురూప్ చొక్కా పట్టుకుని - "ఏం బే, నేను నీకు నర్వర్‌లా కనబడుతున్నానా? ఒళ్ళెలా ఉంది?" అన్నాడు.

అనురూప్ కంగారు పడుతూ చప్పున అతని చేతులు పట్టుకుని "క్షమించండి! పొరపాటుపడ్డాను. ఇంతకీ మీరు ...?" అంటూ ఆగిపోయాడు.

"నే నీ హొటల్లో గిన్నెలు కడిగేవాణ్ణి" అంటూ వెళ్ళిపోయా డా వ్యక్తి.

ఎం. శ్రీనివాస్ [ధర్మపురి]

పేషెంట్ గురించి వీడికి ఇంత ఆత్రత ఎందుకట?" అని, కాంపౌండర్ చేతికి అయిదు వంద లిచ్చి - "ఇవి కుష్ఠురోగికి ఇచ్చి పంపించెయ్" అన్నాడు డాక్టరు.

ఆ మాటలు సుమతి విన్నది - "లేదు డాక్టర్! అతన్ని మేం చూడాలి. కృతజ్ఞతలు చెప్పుకోవాలి" అంటూ బయటి కొచ్చింది.

కుష్ఠురోగిని చూడగానే ముందు సుమతి మనసులో ఏహ్యాభావం ఏర్పడినా, తన కొడుకుని - ఆశల దీపాన్ని - అతడు రక్షించాడనే భావన దాన్ని తుడిచేసింది.

కుష్ఠురోగి ఆమెని అలా చూస్తుండిపోయాడు.

"మా బాబుని రక్షించినందుకు థాంక్స్! నీకు చాలా ఋణపడి ఉంటాం" అంది ముక్తసరిగా.

కుష్ఠురోగి ఏం మాట్లాడలేదు.


"నీ గురించి ను వ్వెప్పుడూ ఆలోచించుకోవా?" సుమతి అడిగింది. కుష్ఠురోగి చెప్పాడు - "ఆ అవసరం ఉందని నా కెప్పుడూ అనిపించలేదమ్మా! నా అనుకున్న వాళ్ళు నాకు దూరమైనప్పుడు, నన్ను దూరంగా ఉంచినప్పుడు అవసరం ఎలా ఉంటుం దమ్మా? ఈ బతుకు ఇలా తెల్లారిపోవాల్సిందే. ఏదో... రోజూ ఈ జానెడు పొట్టకి దాణా పడితే చాలమ్మా. చాలు!" కుష్ఠురోగి కంఠంలో వైరాగ్యం తొణుకు జీర.

హరనాథరావు అక్కడి కొచ్చాడు. కుష్ఠురోగిని చూసి ఏం మాట్లాడలేదు. మాట్లాళ్ళేకపోయాడు!

** ** **

హరనాథరావు గదిలోంచి బయటి కొచ్చి మెట్లు దిగి, హాల్లోంచి బయటికి వెళ్ళబోతున్న మురళిని ఆపింది సుమతి.

హరనాథరావు అసిస్టెంటు మురళి.



"ఏమిటి మురళీ! ఎవరికి పంపించమని ఆయన నీకు అయిదు వంద లిస్తున్నారు? అంతగా ఊళ్ళోంచి వెళ్ళగొట్టవలసిన వ్యక్తి ఎవరయ్యా?" అడిగింది సుమతి.

మురళి త లొంచుకున్నాడు.

"మీ ఇద్దరి సంభాషణా నేను విన్నా. ఏం దాచక్కర్లేదు. చెప్పు. పరవాలేదు." విషయం మురళి చేత చెప్పించాలని సుమతి ప్రయత్నం.

మురళి మాట్లాడలేదు. సుమతికి అనుమానం మరీ ఎక్కువయింది.

"మొన్న బాబుని రక్షించిన వాడికి పారితోషికంగా ఇమ్మని... రావుగా రిచ్చారు" నేల చూపులతో సమాధానం ఇచ్చాడు మురళి.

"పారితోషికం ఇవ్వచ్చు. తప్పు లేదు. అది మన సంతోషాన్ని ప్రకటించడం అవుతుంది. మరి ఊరునుంచి వెళ్ళిపొమ్మనడం దేనికి? ఆయన నీతో చెప్తుండగా నే విన్నా" మురళి కళ్ళలోకి సూటిగా చూసింది సుమతి.

మురళి నీళ్ళు నములుతున్నాడు. తల మాత్రం ఎత్తడం లేదు.

"చూడు మురళీ! నీకు పిల్ల లున్నారు కదూ?


"ఉన్నారు మేడమ్! ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయీ!"

"వా ళ్ళిద్దరి మీదా ప్రమాణం చేసి చెప్పు" అనేసరికి కంగారుపడ్డాడు మురళి.

"నువ్ నిజం మాత్రమే చెబుతావని ఆశిస్తాను. పిల్లల మీద ఒట్టు పెట్టి కూడా అబద్ధం చెబుతావని, చెప్పగలవని నే ననుకోను."

మురళి ముందరి కాళ్ళకి బంధం పడింది. కొద్ది క్షణాల మౌనం. ఆ నిశ్శబ్దాన్ని చీల్చింది మురళి గొంతు - 'నిజం' ఏమిటో చెప్పి.

నిజం విని సుమతి నిర్ఘాంతపోయింది. ఆమె భ్రుకుటి ముడిపడింది. గుండె వేగం హెచ్చింది.




చిత్తరువులా అయింది. నమ్మలేకపోయింది. కలా, నిజమా - అనే సందిగ్ధంలో పడింది.

"ఆ కుష్ఠురోగి - హరనాథరావుగారి తండ్రి మేడమ్!"

మురళి చెప్పిన మాటలు సుమతి చెవిలో మార్మోగుతున్నాయి. వినవిసా మెట్లెక్కి భర్త గదిలోకి వెళ్ళింది.

హరనాథరావు ఏదో పుస్తకం చదువుతున్నాడు.

"మన పెళ్ళి కాక ముందు మీరు నాతో ఏం చెప్పారో గుర్తుందా?" సుమతి భర్త నడిగింది.

అర్థం కానట్టు చూశాడు హరనాథరావు.

"మీ మాటలు నమ్మి మా వాళ్ళని వదులుకుని మీతో వచ్చేశాను. మన పెళ్ళి కాకమునుందు మీకు తండ్రి లేరని చెప్పారు. చిన్నప్పట్నుంచీ తండ్రి లేని లోటు, వెలితి నాకు తెలుసండీ. ఉండి కూడా లేరనీ, చనిపోయారనీ చెప్పుకోడాన్ని మించిన దౌర్భాగ్యం మరొకటి ఉండదండీ!" కోపంగా అంది సుమతి.

దోషిలా త లొంచుకున్నాడు హరనాథరావు.

"ఆ రోజు నా తండ్రి కుష్ఠురోగి అని మీరు నాతో చెబితే నేను అసహ్యించుకుంటాననేమో - తండ్రి లేరని చెప్పారు. మన ఇష్టాయిష్టాల కోసం పెద్దవాళ్ళని చంపెయ్యక్కర్లేదండీ! నిజం ఈ రోజు తెలియకపోయినా రేపు తెలుస్తుంది. లేదా ఆ మర్నాడు. అంతే గానీ దాగదు." ఆమె కోపం పదాల్లో పొదుగుతోంది.

"ఆ శాపగ్రస్తుల్ని మనం చేరదీయాలి. వారికి ఆదరణ కావాలి. అందరూ వాళ్ళని దూరంగా ఉంచితే - అదే ఆ ఒంటరి తనమే వాళ్ళని క్షోభకి గురి చేస్తుంది. ఒక మెడికల్ ఆఫీసర్ అయ్యుండి... లెప్రా బాసిల్లస్ గురించి తెలిసుండి - న్యాయానా - కన్న తండ్రిని కుష్ఠురోగి అని అలా గాలికి వదిలేస్తారా? సిగ్గు అనిపించలేదూ?"

గదిలోంచి బయటి కొచ్చింది సుమతి. "నేను వెళ్ళి మామయ్యగారిని తీసుకొచ్చి ఇంట్లో పెడతాను. సేవలు చేస్తాను. పువ్వుల్లో పెట్టుకు చూసుకుంటాను. అందరినీ చేరదీసే అవకాశం మనకి లేదు. కనీసం మామయ్యగారిని తీసుకొస్తా!" కంట తడి తుడుచుకుంది సుమతి. ఆమె మెట్లు దిగి వెళుతోంది.

చూస్తూ నిల్చుండిపోయాడు హరనాథరావు. తన సంకుచితత్వాన్ని నిందించుకున్నాడు. సుమతి వ్యక్తిత్వం ఎంతటి ఉన్నతమైనదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. ★

